క్లుప్తంగా

దుర్గామాత మండపానికి బహుమతి



నర్సంపేట : పట్టణంలోని మల్లంపల్లి రోడ్డులోని వల్లభ్‌నగర్ దుర్గామాత మండపానికి ఎస్ఎస్ఎస్ ఫౌండేషన్ ప్రతినిధులు ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొదటి బహుమతి ప్రకటించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మండపాన్ని మంగళవారం సందర్శించి బహుమతి ప్రకటించగా ఏసీపీ కిరణ్‌కుమార్ చేతుల మీదుగా నిర్వాహకుడు నాళం విజయ్ కుమార్‌కు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ రమణమూర్తి, ఎస్సైలు రవికుమార్, అరుణ్, దిలీప్, న్యూ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సన్మానం



వర్ధన్నపేట : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై చందర్‌ను తెలంగాణ జన సమితి (టీజేఎస్) నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎలిశాల రాజేశ్, ప్రజాసంఘాల నాయకులు మంగళవారం సన్మానించారు. తొలుత పూలబొకే అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గడ్డల పూర్ణచందర్, మునుకుంట్ల సూరయ్య, బండౌతాపురం మాజీ సర్పంచ్ డానియెల్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలోని లయోల హైస్కూల్‌లో 2003–04 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రంజాన్, మల్లయ్య, సాంబయ్య, సారంగపాణి, ముస్తఫా, గుగులోతు సుధాకర్, మౌలాల్, రమేశ్, కిషన్, నవీన్, సుమ, హారిక, హసీన, అనూశ, తదితరులు పాల్గొన్నారు.

ఎలుకుర్తి హవేలీ జెడ్పీ హైస్కూల్‌లో..



గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలి జెడ్పీ హైస్కూల్‌లో 2004–05 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకుని సందడి చేశారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి అనుభవాలను పంచుకున్నారు.

ఆస్పత్రి ఎదుట చెట్ల నరికివేత



వర్ధన్నపేట: వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని చెట్లను నరికి వేయడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి ఎదుట రెండు చెట్లు ఉన్నాయి. ఎవరు సలహా ఇచ్చిరో కానీ ఏకంగా ఆ చెట్లను నరికి వేయించారు. దీంతో ఆస్పత్రి ఎదుట నిలువ నీడ లేకుండా పోయిందని రోగులు, రోగుల సహాయకులు వాపోతున్నారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామ్మూర్తిని ‘సాక్షి’ వివరణ కోరగా ఆస్పత్రి భవనంపై పడిపోయే ప్రమాదం ఏర్పడడంతోనే ఆ చెట్లను తొలగించాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. ప్రమాదకరంగా ఉన్నట్లు చెట్లను ఏమైనా ఫొటోలో తీయించారా అని ప్రశ్నించగా అలాంటిది ఏమి చేయలేదని పేర్కొన్నారు. ఆస్పత్రి సిబ్బంది, తోటి వైద్యాధికారుల నిర్ణయం తీసుకుని తొలగించామని, ఇందులో దురుద్దేశం లేదన్నారు.


పరామర్శ

వర్ధన్నపేట : మండలంలోని కుమ్మరితండాకు చెందిన రైతు భూక్యా బిల్యా గత నెల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మంగళవారం పరామర్శించారు. తొలుత బిల్యా చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు, మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, మాజీ సర్పంచ్ గుజ్జ సంపత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, నాయకులు ఏరుకొండ వేణుగోపాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఉపాధ్యాయులు..

ఇష్టంతో చదివి ఉద్యోగాలు సాధించారు..

● కలలను సాకారం చేసుకున్న అభ్యర్థులు



దుగ్గొండి : వారంతా పేద కుటుంబాల్లో జన్మించారు. కష్టపడి ఇష్టంతో చదివారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టాలనే లక్ష్యంతో ముందుకు సాగారు. పదేళ్లుగా ఉపాధ్యాయ ఉద్యోగం కోసం ఎదురు చూశారు. ఎట్టకేలకు ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ వేయడంతో పరీక్షలు రాసి మంచి మార్కులతో ర్యాంకులు సాధించారు. ఉద్యోగాలకు ఎంపికై పేదింటిలో వెలుగులు నింపారు. చదువుకు పేదరికం అడ్డు కాదని నిరూపించారు. ఉపాధ్యాయులుగా బోధించాలనే వారి స్వప్నాన్ని సాకారం చేసుకున్నారు. బుధవారం ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకోనున్నారు.

భర్త ప్రోత్సాహం మరువలేనిది..



మాది పేద కుటుంబం. పెళ్లి అయ్యాక భర్త విశ్వనాథ్ నన్ను బీఈడీ చదివించారు. అనంతరం టీచర్ ఉద్యోగానికి ప్రిపేర్ అయ్యాను. ఇటీవల డీఎస్సీలో నేను పుట్టిన జిల్లా ములుగు పరిధిలో స్కూల్ అసిస్టెంట్ (బయోసైన్స్) 2వ ర్యాంకు సాధించా. ప్రభుత్వం ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉంది. నా భర్త నన్ను ప్రోత్సహించి ఉండకపోతే నేను గృహిణిగానే మిగిలి ఉండేదాని. ఈ రోజు ఉద్యోగం వచ్చింది అంటే అది ఆయన ఇచ్చిన ప్రోత్సాహమే. చదువుకు, ఉద్యోగం సాధించడానికి పెళ్లి అడ్డుకాదు. పెళ్లి అయినా పట్టుదల ఉంటే సాధించవచ్చు. భర్తలు తమ భార్యల అభిప్రాయాలను గౌరవించాలి. లక్ష్యసాధనలో స్వేచ్ఛనివ్వాలి.

– కోట సమత, నాచినపల్లి

ఆరు నెలలు బయటికి రాలే..



మాది అత్యంత పేద కుటుంబం.. ఇద్దరం అన్నదమ్ములం. అమ్మ విజయ, నాన్న మల్లయ్య. అనారోగ్యంతో నాన్న చనిపోయారు. ఒకటే గది ఉన్న ఇల్లు మాది. నాకు చిన్నప్పటి నుంచి ఉపాధ్యాయుడిగా సేవలందించాలని కోరిక. పేదరికాన్ని జయించాలనే తపన, పేదింటి బిడ్డలకు మార్గం చూపాలనే పట్టుదల ఉండేది. టీటీసీ పూర్తి చేశాక కుటుంబం కోసం చాలా సంవత్సరాలు ప్రైవేట్ ఉద్యోగం చేశా. డీఎస్సీ కోసం వేయికళ్లతో ఎదురు చూశా. దీంతో ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ వేస్తామని ప్రకటించడంతో ఇంటికే పరిమితం అయ్యాను. నా కోసం మా అన్న కుటుంబం, మా అమ్మ కష్టపడ్డారు. ఆరు నెలల నా పోరాటం ఫలించింది. ఎస్‌జీటీ విభాగంగా జిల్లాలో 81వ ర్యాంకు (ఎస్సీ విభాగంలో జిల్లా 3వ ర్యాంకు) సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యాను. ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రం అందుకునే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉంది. నా కుటుంబాన్ని పేదరికం నుంచి దూరం చేస్తా.

– జన్ను శివ, నాచినపల్లి

పట్టుదలే ప్రగతికి సోపానం..



గురుకుల పాఠశాలలో కాంట్రాక్టు ఉపాధ్యాయురాలిగా పనిచేశా. అక్కడ ఉన్న పేద ఆడపిల్లలను చూసి వారికి ఏదైనా సాయం చేయాలి అంటే నాభర్త జమాలుద్దీన్ అందుకు ఆర్థిక తోడ్పాటు అందించేవారు. నేను ఎలాగైనా డీఎస్సీ రాయాలి.. ఉద్యోగం సాధించాలి.. పేదలకు సాయం అందించాలనే పట్టుదలతో ముందుకు సాగా. మా పుట్టిల్లు సిద్దిపేట జిల్లా కావడంతో ఆ పరిధిలో రాశా.. హిందీ పండిట్ గ్రేడ్–1 విభాగంలో సిద్దిపేట జిల్లాలో మొదటి ర్యాంకు సాధించా. బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ నియామాక పత్రం అందుకునే అదృష్టం రావడం చాలా సంతోషంగా ఉంది. పట్టుదలే ప్రగతికి సోపానం అవుతుందని గుర్తించా.. లక్ష్యాన్ని చేరుకున్నా. భవిష్యత్ తరాలకు మార్గనిర్దేశకురాలిగా ఉంటా.

– ఎండీ.ఫర్జానా

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



నర్సంపేట : దుర్గామాతకు పూజ చేస్తున్న కౌన్సిలర్, భక్తులు

సాక్షి నెట్‌వర్క్ : పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో కమిటీ అధ్యక్షుడు అంచూరి కృష్ణమూర్తి, నాగమల్ల కృష్ణమూర్తి, పిన్నా రామనాథం ఆధ్వర్యంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం నిర్వహించారు. అమ్మవారు కాత్యాయని అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భద్రకాళీ దేవస్థాన వేద పండితులు ఎం.రామకృష్ణశర్మ శిష్య బృందం ఆధ్వర్యంలో చండీహోమం చేశారు. కొడకండ్ల కుసుమ–నాగేశ్వర్‌రావు దంపతులు అన్నదానం చేశారు. పదో వార్డులోని పోచమ్మ ఆలయంలో దుర్గామాత అమ్మవారు మహాలక్ష్మీదేవి అవతావరంలో దర్శనమించ్చారు. వేద పండితుడు నిశాంత్ శర్మ ఆధ్వర్యంలో కౌన్సిలర్ నాగిశెట్టి పద్మ ప్రసాద్, పోచమ్మ తల్లి మహిళా ఉత్సవ కమిటీ బాధ్యులు పూజలు నిర్వహించారు. సంతోషిమాత ఆలయంలో అమ్మవారు స్కందమాత అవతావరంలో దర్శనమివ్వగా అర్చకులు గట్టు నారాయణచార్యులు, శ్రీనివాసాచార్యులు అమ్మవారితోపాటు హయగ్రీవ, నరసింహస్వామి విగ్రహాలకు పంచామృత అభిషేకం, కుంకమార్చన, పంచసూక్త పారాయణం, శ్రీలక్ష్మి నారసింహ హోమం, పూర్ణాహుతి పూజ నిర్వహించారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. చెన్నారావుపేట మండలంలోని గ్రామాల్లో దుర్గామాత విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్ధన్నపేటలోని అమ్మవారు శాకంబరి దేవిగా దర్శనమిచ్చారు. భక్తులు లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఆలయ అర్చకులు కలకోట రామాచారి, శ్రవణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పరపల్లిలో అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చనలు, అభిషేకాలు, భజనలు కీర్తనలతో భక్తులు సందడి చేశారు. దుగ్గొండి మండలంలో అమ్మవారు లక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారిని భక్తులు కరెన్సీ నోట్లతో అలంకరించారు. నాచినపల్లిలోని పెద్దమ్మతల్లి ఆలయంలో ముదిరాజ్ మహాసభ ఎస్ఆర్‌వి విభాగం రాష్ట్ర కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గీసుకొండ మండలంలోని ధర్మారంలో సేవ, గణేశ్, శ్రీఅంజలి, సెగశ్రీ ఆర్గనైజేషన్ల ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. అమ్మవారు భవానీమాత రూపంలో దర్శనం ఇవ్వగా పురోహితులు నాగార్జున శర్మ, గోపికృష్ణ శర్మ హోమాన్ని చేపట్టారు.

బతుకమ్మలతో ఉద్యోగుల సందడి



వర్ధన్నపేట : బతుకమ్మ ఆడుతున్న మహిళలు



గీసుకొండ : బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగులు

వర్ధన్నపేట : పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాంగణంలో సీడీపీఓ డెబోరా, పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ మల్లెపాక అనిత ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వర్ధన్నపేట, రాయపర్తి, సంగెం, పర్వతగిరి, గీసుకొండ మండలాల నుంచి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొని బతుకమ్మలతో ఆడిపాడారు.

గీసుకొండ : మండల కేంద్రంలోని మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఆర్‌ఐ సాంబయ్య, ఏపీఓ చంద్రకాంత్, ఎస్ఐఆర్‌డీ ప్రతినిధి నిమ్మల శేఖర్, ఎస్సై షాజహాన్, పంచాయతీ కార్యదర్శులు కల్యాణి, సునీత, హేమలత, ప్రవీణ, శారద, సంధ్యారాణి, చంద్రకళ, కనకతార, ఎఫ్ఏలు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఐకేపీ సిబ్బంది, మహిళా సంఘం సభ్యులు, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు బతుకమ్మ ఆడిపాడారు. కార్యక్రమంలో ఎంపీఓ పాక శ్రీనివాస్, ఏపీఓ సుశీల్‌కుమార్, ఏపీఎం కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏర్పాట్లు



నర్సంపేట రూరల్ : సద్దుల బతుకమ్మ, దసరా పండుగల నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆదేశించారు. నర్సంపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో స్వచ్ఛత హీ సేవా కింద సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. బతుకమ్మలు తీసుకొచ్చే మహిళల కోసం గ్రామాల్లో వీధి దీపాలు, ఆట ప్రాంతాల్లో చిన్నపాటి లైట్లు, తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రామ్మోహన్, ఐబీ ఏఈ నితిన్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : సద్దుల బతుకమ్మ, దసరా పండుగల ఏర్పాట్లలో లోటు రాకుండా చూడాలని తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ నల్ల శ్రీవాణి కోరారు. ఏర్పాట్లపై మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. బతుకమ్మ ఆట ప్రదేశాల్లో లైట్లు, నీళ్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. సమావేశంలో ఎస్సై రాజేశ్‌రెడ్డి, ఎంపీఓ శ్రీధర్ రాజు, స్పెషల్ ఆఫీసర్లు మంగీలాల్, డాక్టర్ మంజీలాల్, డాక్టర్ రాధిక, తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం



దుగ్గొండి : స్థలాన్ని పరిశీలిస్తున్న బాబు, తదితరులు

దుగ్గొండి : మండలంలోని అన్ని గ్రామాల్లో దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల బాబు తెలిపారు. మండల కేంద్రంలో దసరా ఉత్సవాల నిర్వహణ కోసం స్థలం, ఇతర ఏర్పాట్లను ప్రత్యేక అధికారులు, ఆ పార్టీ నాయకులు మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడారు. దసరా వేడుకల నిర్వహణలో పార్టీ శ్రేణులు భాగస్వాములవుతున్నట్టు తెలిపారు. రావణాసుర వధ నిర్వహణకు స్థలాన్ని నిర్ణయించినట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కొలిపాక బుచ్చయ్య, కొమ్మ లక్ష్మయ్య, ఏరుకొండ కొమురయ్య, శంకేషి రమేశ్, కామిశెట్టి రమేశ్, పులి భిక్షపతి, సోనబోయిన రవి, కొలిపాక రవి, పోలోజు సదానందం, కడవంచి యాకయ్య, తోకల మధూకర్‌రెడ్డి, మనుబోతుల రవి, ఎర్రల్ల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



నల్లబెల్లి : ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్సై ప్రశాంత్

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

నల్లబెల్లి : సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను ప్రశాంత వాతావరణలో జరుపుకోవాలని ఎస్సై ప్రశాంత్ బాబు చెప్పారు. మండల కేంద్రంలో బతుకమ్మ ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లను పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్‌తో కలిసి ఎస్సై పరిశీలించారు. పండుగ సమయంలో తీసుకోవాల్సి జాగ్రత్తలను పంచాయతీ కార్యదర్శికి వివరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటి సభ్యులు బత్తిని మహేశ్, గుమ్మడి వేణు, మాసంపెల్లి అఖిల్ పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యత



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఫారెస్ట్ అధికారులు

ఖానాపురం : వన్యప్రాణుల సంరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) రవికిరణ్ కోరారు. వన్యప్రాణుల వారోత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని పాకాలలో మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడారు. వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేయడం ద్వారా వన్యప్రాణుల సంరక్షణకు బాటలు వేయడమే వారోత్సవాల ఉద్దేశమని చెప్పారు.

గ్రామ కమిటీలతో పార్టీ బలోపేతం

నల్లబెల్లి : మండలంలో గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి తెలిపారు. మండలంలోని దస్తగిరిపల్లిలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకునేలా కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీలను ప్రకటించారు. కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మందాటి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా బాషబోయిన బాబు, పెండ్యాల భద్రయ్య, పెంబర్తి సదయ్య, ప్రధాన కార్యదర్శిగా పెంబర్తి విష్ణు, కార్యదర్శిగా ఎడెల్లి గణపతిరెడ్డి, పడాల దేవేందర్, కోశాధికారిగా భాషబోయిన తిరుపతిలను ఎన్నుకున్నారు. యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పెండ్యాల రాకేశ్, ఉపాధ్యక్షులుగా కేశబోయిన భాస్కర్, మనోహరస్వామి, ప్రధాన కార్యదర్శిగా పెండ్యాల రమేశ్, కార్యదర్శిగా రంజిత్, రమేశ్, కోశాధికారిగా కల్యాణ్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు శివారెడ్డి, శేఖర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఉత్పత్తులు తేవాలి

గీసుకొండ: కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యం, ముడిపత్తిని తీసుకురావాలని డీఏఓ అనురాధ సూచించారు. కొనాయమాకుల రైతు వేదికలో మంగళవారం ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. తాలు, ఇతర గింజలు లేకుండా యంత్రాల ద్వారా శుభ్రపరిచిన తర్వాతే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. ముడి పత్తిని ఏరడానికి తెల్లని యూరియా బస్తాలు వాడొద్దని, దాని వల్ల పత్తిలో ప్లాస్టిక్ చేరి నాణ్యత దెబ్బతింటుందని పేర్కొన్నారు. పురుగు మందులను వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచించిన మేరకు వాడాలని, లేదంటే ఆహార చక్రంలో అవి ప్రవేశించి ప్రాణాంతక కేన్సర్‌కు దారితీస్తాయని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని ఎరువులు, క్రిమిసంహారక మందుల షాపులను తనిఖీ చేశారు. ఏఓ పి.హరిప్రసాద్‌బాబు, ఏఈఓలు సంపత్, రజని, కావ్య, స్మిత పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నారావుపేట : మండలవ్యాప్తంగా నేడు (బుధవారం) ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ జోగానంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో మరమ్మతులు చేస్తున్నట్టు వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రతిభను వెలికితీయడమే నిజమైన విద్య

నర్సంపేట : పిల్లల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడమే నిజమైన విద్య అని ప్రముఖ విద్యావేత్త, సీఏ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని లీడ్ గ్రంథాలయంలో కాసుల రవికుమార్ అధ్యక్షతన ‘చదువులు–కొత్తదారులు’ అంశంపై మంగళవారం నిర్వహించిన సదస్సుకు ప్రసాద్ హాజరై మాట్లాడారు. పుస్తకాలను, గ్రంథాలయాలను నేర్పించడంలో భాగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం మరో అతిథిగా హాజరైన ప్రముఖ వైద్యుడు జగదీశ్వర్ మాట్లాడారు. కథలు, పాటలు, చిన్నపాటి గేయాలతో పిల్లల్లో చదువుపై ఆసక్తి పెంపొందించేలా చేయాలని కోరారు. అనంతరం ప్రసాద్‌ను ఘనంగా సన్మానించి పుస్తకాలను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో సోషల్ థింకర్స్ సభ్యులు కొర్ర రమేశ్, ఇసాక్, లీడ్ గ్రంథాలయం నిర్వాహకురాలు కాసుల శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్ఆర్ఆర్’ చేయూత

వర్ధన్నపేట : పట్టణానికి చెందిన గోధుమల రాములు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చేయూత అందించింది. ఫౌండేషన్ అధినేత పరిపాటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు ప్రతినిధులు బాధిత కుటుంబానికి మంగళవారం 50 కేజీల బియ్యంతోపాటు 10 కేజీల వంట నూనె అందజేశారు. కార్యక్రమంలో గోధుమల మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

గీసుకొండ : ధర్మారంలో సింగనబోయిన కుమారస్వామి (60) మద్యం మత్తులో గొర్రెలకు వేసే మందు తాగి మృతి చెందాడు. వివరాలిలా.. కుమారస్వామి ఈ నెల 5న మద్యం మత్తులో గొర్రెలకు వేసే డూరోసిన్ డీఎస్ అనే మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. అతడిని కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

చెన్నారావుపేట : రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన చెన్నారావుపేట శివారులోని నెక్కొండ–నర్సంపేట ప్రధాన రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చెన్నారావుపేటకు చెందిన మండల మల్లయ్య సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా జల్లి గ్రామానికి చెందిన మహ్మద్ రబ్బానీ నడుపుతున్న ద్విచక్ర వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లయ్యకు తీవ్ర గాయాలవగా స్థానికులు చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి తదనంతరం హనుమకొండలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించినట్టు తెలిసింది.

ఉద్యమాల బలోపేతానికి కార్యాచరణ



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

నర్సంపేట : రైతాంగాన్ని రక్షించి దేశాన్ని కాపాడేందుకు రాజకీయాలకతీతంగా రైతులు, కూలీలను ఏకం చేసి రైతు వ్యతిరేక మనువాద పాలకుల విధానాలపై పోరాటం తీవ్రతరం చేయడానికి క్షేత్రస్థాయి కార్యాచరణతో ముందుకు సాగాలని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్ తెలిపారు. బెంగుళూరులోని గాంధీ భవన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) దక్షిణాది రాష్ట్రాల సంయుక్త నాయకత్వ సమావేశాల్లో రమేశ్ మాట్లాడారు. పాలకులు ఎన్నికల్లో లబ్ధి పొందడానికే ఉచిత పథకాలు ప్రవేశపెట్టి, శ్రమకు తగిన ప్రతిఫలం కల్పించకుండా పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. ఆరుగాలం కష్టపడి అప్పు తెచ్చి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించకుండా, కనీస మద్దతు ధర అమలు చట్టం చేయకుండా పరోక్షంగా వ్యాపారులు, పెట్టుబడిదారులు, దళారులకు అండగా నిలుస్తున్నారని మండిపడ్డారు. అప్పుల పాలైన రైతులను ఆదుకోకపోగా రైతుల నుంచి దోచుకున్న సంపదను కార్పొరేట్ పెట్టుబడిదారులకు రాయితీగా కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. ఎస్‌కేఎం కార్యాచరణను జయప్రదం చేయడానికి సంఘాలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు ఉపేందర్‌రెడ్డి, హంసారెడ్డి, బాబురావు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో విలీనం చేయొద్దు

నర్సంపేట రూరల్ : స్థానిక మున్సిపాలిటీలో మాదన్నపేట గ్రామాన్ని విలీనం చేయొద్దని ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ శ్రీనివాసరావుకు మంగళవారం అందజేసింది. అనంతరం రాజమౌళి మాట్లాడారు. మున్సిపాల్టీలో విలీనం చేస్తే గ్రామాల అస్తిత్వానికి ప్రమాదం ఉందన్నారు. విలీన ప్రక్రియతో గ్రామాలకు ప్రయోజనం ఏమీ లేదని చెప్పారు. విలీన చేస్తే రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగి వ్యవసాయ రంగం నిర్వీర్యం అవుతుందని ఆందోళన వెలిబుచ్చారు. ఇప్పటివరకు మున్సిపాల్టీలో విలీనం చేసిన గ్రామాలన్నీ అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా విలీనం చేస్తే ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కౌట్టి సదానందం, జన్ను రమేశ్, మాజీ సర్పంచ్ కర్నె సాంబయ్య, ఏఐఎఫ్‌డీఎస్ డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజు, మహిళా సంఘం సభ్యురాలు సుధ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం

చెన్నారావుపేట : క్రీడలతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిళి వెంకట్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అమృతండాలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బోడ నర్సింహ, కంచ ప్రభాకర్, భూక్య శంకర్, బానోతు మంగీలాల్, భూక్య భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ వెంకన్న, ధన్‌సింగ్, ప్రవీణ్, సంతోశ్, బాలు, పంచాయతీ కార్యదర్శులు రాజు, శ్యామ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన బొజ్జ పద్మకు ఆమె భర్త అంద్రు నర్సింహ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా పదో తరగతి నాటి మిత్రులు మంగళవారం రూ.25 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పెండ్యాల యాదగిరి, ఎర్ర రవి, కొండపర్తి చంద్రమోహన్, కుమారస్వామి, మహేందర్, కరుణాకర్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.